క్లుప్తంగా

నేడు హెల్మెట్ ధారణపై అవగాహన ర్యాలీ

నూజివీడు: మండల న్యాయ సేవాధికార సంస్థ ఆధ్వర్యంలో హెల్మెట్ ధారణపై అవగాహన ర్యాలీని గురువారం నిర్వహిస్తామని న్యాయ సేవాధికార సంస్థ చైర్మన్, 15వ అదనపు జిల్లా జడ్జి ఎ.నాగశైలజ బుధవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ర్యాలీ ఉదయం 8 గంటలకు నూజివీడులో కోర్టు నుంచి ప్రారంభమై ప్రధాన వీధుల్లో కొనసాగుతుందన్నారు. న్యాయమూర్తులు, న్యాయవాదులు, కోర్టు సిబ్బంది పాల్గొంటారన్నారు. వాహనదారులు పాల్గొనాలని విజ్ఞప్తి చేశారు.

డాక్టర్ విశ్వామిత్ర షూటింగ్ సందడి



మైలవరం: బొర్రగూడెంలోని శ్రీలక్ష్మీ తిరుపతమ్మ సమేత గోపయ్య స్వామి దేవస్థానంలో బుధవారం డాక్టర్ విశ్వామిత్ర చిత్రం షూటింగ్ ప్రారంభమైంది. శివసాయి బాలాజీ మూవీ మేకర్స్ పతాకంపై నిర్మిస్తున్న ఈ చిత్రంలో శివరామ్ హీరోగా, సామ్య వీరంకి హీరోయిన్‌గా, వెంకట నరసింహారావు, రామకృష్ణ రంగనాయకులు, బాలచందర్ తదితరులు ప్రధాన పాత్రల్లో నటిస్తున్నారు. జనసేన పార్టీ రాష్ట్ర అధికార ప్రతినిధి అక్కల రామ్మోహనరావు (గాంధీ) తొలి సన్నివేశానికి క్లాప్ కొట్టారు. చిత్రానికి డైరెక్టర్ సాయి వెంకట్, కో డైరెక్టర్లు బాలచందర్ భార్గవ్, ముహూర్తం షాట్‌కు దర్శకత్వం వహించారు.

24 నుంచి వైజ్ఞానిక శిక్షణ తరగతులు



నూజివీడు: ఏపీ మున్సిపల్ వర్కర్స్ యూనియన్ (ఏఐటీయూసీ అనుబంధం) రాష్ట్ర స్థాయి వైజ్ఞానిక శిక్షణ తరగతులు ఈ నెల 24, 25, 26 తేదీల్లో మదనపల్లి హార్సిలీ హిల్స్‌లో నిర్వహిస్తామని ఏఐటీయూసీ రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ చలసాని వెంకట రామారావు తెలిపారు. పట్టణంలోని అమర్‌భవన్‌లో బుధవారం వైజ్ఞానిక శిక్షణ తరగతులకు సంబంధించిన కరపత్రాలను ఆవిష్కరించి మాట్లాడారు. ఏఐటీయూసీ ఏలూరు జిల్లా ప్రధాన కార్యదర్శి కె.బుచ్చిబాబు, జిల్లా ఉప ప్రధాన కార్యదర్శి చాట్ల పుల్లారావు, జిల్లా మున్సిపల్ కార్మికుల యూనియన్ అధ్యక్షుడు కె.విష్ణు, స్థానిక నాయకులు పాల్గొన్నారు.

రిటైర్డు ఉపాధ్యాయులకు సన్మానం



తిరువూరు: సుదీర్ఘకాలం పనిచేసి పదవీ విరమణ చేసిన ఉపాధ్యాయులు ఎస్. జగన్మోహనరావు, పి. శీనయ్య దంపతులను బుధవారం స్థానిక సుందరయ్య భవన్‌లో జన విజ్ఞాన వేదిక ఆధ్వర్యంలో ఘనంగా సన్మానించారు. జేవీవీ జిల్లా గౌరవాధ్యక్షుడు వల్లభనేని రవీంద్ర, జిల్లా ప్రధాన కార్యదర్శి ఎల్. గంగాధర్, జిల్లా మాజీ కార్యదర్శి హరికృష్ణ, సభ్యులు పాల్గొన్నారు.

వరకట్న వేధింపులపై కేసు నమోదు

ఇబ్రహీంపట్నం: వరకట్నం వేధింపులపై ఇబ్రహీంపట్నం పోలీస్ స్టేషన్‌లో కేసు నమోదైంది. సీఐ ఎం.సత్యనారాయణ తెలిపిన వివరాల ప్రకారం.. శ్రామికనగర్‌కు చెందిన కల్యాణి, గణేష్ గత నెల 29న ప్రేమ వివాహం చేసుకున్నారు. భర్త గణేష్ కుటుంబ సభ్యులు కౌసల్య, దుర్గారావు, చంద్రమోహన్‌వరకట్నం కోసం శారీరకంగా, మానసికంగా వేధింపులకు గురిచేస్తున్నారని కల్యాణి తన తల్లి దుర్గకు చెప్పింది. దీనిపై ప్రశ్నించిన తల్లి బత్తుల దుర్గ, చెల్లెలు లక్ష్మీపై గణేష్ కుటుంబ సభ్యులు దాడి చేశారు. బాధితురాలి ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేశారు.

ఆలయ నిర్మాణానికి దాతల విరాళాలు



తిరువూరు: స్థానిక జగన్నాథపురంలో నిర్మాణంలో ఉన్న దాసాంజనేయస్వామి ఆలయానికి పలువురు దాతలు బుధవారం విరాళాలు అందజేశారు. వ్యాపార ప్రముఖుడు నాళ్లా వెంకట సత్యనారాయణరావు రూ.లక్షా 11 వేల 111, దారా భూమయ్య రూ.1,01,116, గుండా రంగారావు రూ.10,116, పాలెపు పుల్లారావు రూ.20,350, కంచి రామనాగేశ్వరరావు రూ.10,116, నీలం వెంకటేశ్వరరావు రూ.10, 116 విరాళాలను ఆలయ నిర్మాణ కమిటీకి అందజేశారు.

బైపాస్ రోడ్డు కోసం ఎదురుచూపులు



బైపాస్ నిర్మాణానికి సర్వే పూర్తి చేసిన ప్రాంతం



నూజివీడు పట్టణంలో వాహనాల రద్దీ

- రూ.25 కోట్లు మంజూరు చేసిన గత ప్రభుత్వం
- భూ సేకరణకు యజమానులను ఒప్పించిన మాజీ ఎమ్మెల్యే ప్రతాప్ అప్పారావు
- నిర్మాణం పూర్తయితే ట్రాఫిక్ కష్టాలకు చెక్

నూజివీడు: బైపాస్ రోడ్డు నిర్మాణం కోసం నూజివీడు పట్టణ ప్రజలు ఎదురుచూస్తున్నారు. రోడ్డు నిర్మాణానికి గత ప్రభుత్వం రూ. 25 కోట్లను మంజూరుచేసింది. అప్పటి ఎమ్మెల్యే మేకా ప్రతాప్ అప్పారావు భూ యజమానులతో చర్చించి భూములు ఇచ్చేందుకు వారిని ఒప్పించారు. రెవెన్యూ డివిజన్ కేంద్రమైన నూజివీడు పట్టణానికి సంబంధించి మైలవరం రోడ్డు నుంచి విస్సన్నపేట రోడ్డు వరకు బైపాస్ రోడ్డు నిర్మించాల్సి ఉంది. గత ప్రభుత్వం బైపాస్ రోడ్డు నిర్మాణానికి రూ.25 కోట్లు మంజూరు చేసింది. బైపాస్ రోడ్డు నిర్మాణం పూర్తయితే పట్టణంలో ట్రాఫిక్ కష్టాలకు తెరపడినట్లేనని రాజకీయ వర్గాలతో పాటు స్థానికులు పేర్కొంటున్నారు. ట్రిపుల్ ఐటీ వెనుక భాగం నుంచి గొడుగువారిగూడెం మీదుగా పెద్ద చెరువు కళంగి పైభాగాన విస్సన్నపేట రోడ్డుకు కలుస్తుంది. ఈ బైపాస్ రోడ్డు నిర్మాణానికి సుమారు 22.50 ఎకరాల భూమిని సేకరించాల్సి ఉంది. దీనికి సంబంధించి గత ప్రభుత్వం భూ సేకరణ నోటిఫికేషన్ విడుదల చేసి, భూసేకరణ దశను సైతం పూర్తి చేసింది. అప్పటి ఎమ్మెల్యే మేకా వెంకట ప్రతాప్ అప్పారావు భూముల యజమానులతో చర్చించి భూములు ఇచ్చేలా అంగీకరింపజేశారు. అయితే భూములు కోల్పోతున్న భూ యజమానులకు నష్టపరిహారం చెల్లించాల్సి ఉంది.

4.93 కిలోమీటర్ల పొడవు, 10 మీటర్ల వెడల్పుతో నిర్మాణం

బైపాస్ రోడ్డును మైలవరం రోడ్డు నుంచి విస్సన్నపేట రోడ్డు వరకు గొడుగువారిగూడెం ఎగువ భాగం మీదుగా నిర్మించనున్నారు. రోడ్డు పొడవు మొత్తం 4.93 కిలోమీటర్లు, వెడల్పు 10 మీటర్లు (33 అడుగులు). ఈ మార్గంలో బిల్లుడు వాగుపై వంతెనను నిర్మించడంతో పాటు మరో రెండు శ్లాబ్ కల్వర్టులను నిర్మిస్తారు.

రోడ్డు నిర్మాణం పూర్తయితే ట్రాఫిక్ కష్టాలకు చెక్

హైదరాబాద్ నుంచి ఏలూరు వైపునకు వెళ్లే భారీ వాహనాలతో పాటు ఇబ్రహీంపట్నం, కొండపల్లి, జి.కొండూరు, గంపలగూడెం మండలం వినగడప ప్రాంతాల్లో ఉన్న స్టోన్‌క్రషర్ల నుంచి కంకర లారీలు నిత్యం నూజివీడు మీదుగా పశ్చిమ గోదావరి జిల్లాకు రాకపోకలు సాగిస్తుంటాయి. 40 టన్నుల నుంచి 60 టన్నుల లోడుతో భారీ వాహనాలు పట్టణంలోకి వస్తుండటంతో నిత్యం ట్రాఫిక్ ఇబ్బందులు ఎదురవుతున్నాయి. అంతేగాకుండా భారీ వాహనాలు రాకపోకలు సాగిస్తుండటంతో రోడ్లు కూడా దెబ్బతింటున్నాయి. ఈ రోడ్డు నిర్మాణం పూర్తయితే నూజివీడు పట్టణ ప్రజల ట్రాఫిక్ కష్టాలకు తెరపడుతుంది.

బైపాస్ రోడ్డు నిర్మాణం చేపట్టాలి



బైపాస్ రోడ్డును నిర్మిస్తే ట్రాఫిక్ కష్టాలు తొలగిపోతాయి. పట్టణంలోకి భారీ వాహనాలు రాకుండా బయటి నుంచే వెళ్లిపోతాయి. ఇరుకు రోడ్లు కావడంతో పెద్ద గాంధీ బొమ్మ సెంటర్‌లో నిరంతరం ట్రాఫిక్ స్తంభిస్తోంది.

– కంచర్ల లవకుమార్, మాజీ కౌన్సిలర్, నూజివీడు

ఇబ్బందులు ఉండవు



బైపాస్ నిర్మాణం జరిగితే పెద్ద గాంధీ బొమ్మ సెంటర్‌లో ఇబ్బందులు ఉండవు. ఇరుకు రోడ్లు కావడంతో ఇక్కడ నిరంతరం ప్రజలు ట్రాఫిక్ ఇబ్బందులను ఎదుర్కొంటున్నారు. ఆటోలు, బస్సులు ఆపి ప్రయాణికులను ఎక్కించుకునేందుకు, దించేందుకు కూడా ఇబ్బందిగా ఉంటోంది.

– యర్రంశెట్టి రవితేజ, నూజివీడు

గ్రామాల్లో ముమ్మరంగా పారిశుద్ధ్య పనులు



ఎబేట్ మందు పిచికారీ చేస్తున్న సిబ్బంది

తిరువూరు: సీజనల్ వ్యాధులు ప్రబలకుండా వైద్యారోగ్య, పంచాయతీరాజ్ శాఖలు సంయుక్తంగా మండలంలోని పలు గ్రామాల్లో పారిశుద్ధ్య పనులు చేపట్టాయి. లక్ష్మీపురం, కాకర్ల గ్రామాల్లో సచివాలయ ఆరోగ్య కార్యదర్శులు, పంచాయతీ కార్మికులు మురుగు కాలువలు శుభ్రం చేయించి దోమల నిర్మూలనకు ఎబేట్ మందు పిచికారీ చేయించారు. నివాస గృహాల నడుమ నిల్వ ఉన్న వర్షం నీరు, మురుగు నీటి మళ్లింపునకు చర్యలు చేపట్టారు.

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

నూజివీడు: విద్యుత్ లైన్ల మరమ్మతుల నిమిత్తం పట్టణంలోని పలు ప్రాంతాల్లో గురువారం ఉదయం విద్యుత్ సరఫరాకు అంతరాయం కలుగుతుందని ఏపీసీపీడీసీఎల్ నూజివీడు ఈఈ ఎ.సత్యనారాయణ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. కుమ్మరిపేట, అజరయ్యపేట, ఢంఢం గార్డెన్, అమెరికన్ హాస్పటల్ ప్రాంతాల్లో ఉదయం 10 నుంచి మధ్యాహ్నం రెండు గంటల వరకు విద్యుత్ సరఫరాను నిలిపివేస్తామని చెప్పారు.

భక్తిశ్రద్ధలతో తొలి ఏకాదశి



గంపలగూడెంలో అఖండ హరేరామ నామ సంకీర్తనలో పాల్గొన్న భక్తులు



మైలవరం-తిరువూరు రోడ్డులోని మర్రి చెట్టుకు పూజలు నిర్వహిస్తున్న భక్తులు



తిరువూరులో విశేష అలంకరణలో వేంకటాచలస్వామి



ప్రత్యేక అలంకరణలో లక్ష్మీనరసింహస్వామి

గంపలగూడెం: తొలి ఏకాదశి పర్వదినాన్ని మండల ప్రజలు బుధవారం భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. మహిళలు ఇళ్ల వద్ద పుణ్యస్నానాలు ఆచరించి విష్ణుమూర్తికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ప్రత్యేకంగా పేలాల పిండి, పాయసం తయారు చేసి స్వామికి నైవేద్యం సమర్పించి ప్రసాదంగా స్వీకరించారు. తొలి ఏకాదశి సందర్భంగా నెమలి వేణుగోపాల స్వామి, మెట్టగుట్ట శేషాచల శ్రీనివాస స్వామి, గంపలగూడెం, పెనుగొలను, ఊటుకూరు తదితర గ్రామాల్లోని రామాలయాల్లో, స్థానిక భజన మందిరంలో ప్రత్యేక పూజా కార్యక్రమాలు జరిగాయి. ఆయా ఆలయాల్లో అఖండ హరే రామ నామ సంకీర్తన, హనుమాన్ చాలీసా పారాయణ చేశారు. పలు ఆలయాల్లో సంప్రదాయబద్ధంగా పేలాల పిండిని దేవాతా మూర్తులకు నైవేద్యం పెట్టి భక్తులకు పంపిణీ చేశారు. ఆయా కార్యక్రమాల్లో భక్తులు విశేషంగా పాల్గొన్నారు.

ప్రజల జీవితాల్లో ఆనందం నింపాలి..

మైలవరం: తొలి ఏకాదశి అందరి జీవితాల్లో ఆనందం నింపాలని వైఎస్సార్ సీపీ మైలవరం నియోజకవర్గ ఇన్‌చార్జి సర్నాల తిరుపతిరావు అన్నారు. ఈ సందర్భంగా నియోజకవర్గ ప్రజలకు తొలి ఏకాదశి శుభాకాంక్షలు తెలిపారు. ప్రజలందరూ ఆనందంతో, సుఖసంతోషాలతో ఈ ఏడాది గడుపుకోవాలని ఆకాంక్షించారు.

- మైలవరం: మైలవరం తిరువూరు రోడ్డులోని శ్రీహనుమాన్ మందిరం వద్ద ఉన్న మర్రి చెట్టుకు తొలి ఏకాదశి పూజలు భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. భక్తాంజనేయస్వామి ఆలయం ధర్మకర్త మల్లెల వెంకటేశ్వరరావు, భక్తులు పాల్గొన్నారు.
- రెడ్డిగూడెం: స్థానిక రాజగోపాలస్వామి ఆలయంలో, కుదప వెంకటేశ్వరస్వామి ఆలయంతో పాటు మండలంలోని పలు ఆలయాల్లో భక్తులు స్వామి వార్లను దర్శించుకుని పూజలు చేశారు. తీర్థప్రసాదాలు స్వీకరించారు.
- తిరువూరు: స్థానిక వేంకటాచలస్వామి ఆలయంలో తెల్లవారుఝాము నుంచే భక్తులు స్వామివారిని దర్శించుకుని పూజలు చేశారు. కోదండ రామాలయం, రాజుపేట వీరాంజనేయస్వామి ఆలయం, వేంకటాచలస్వామి ఆలయాల్లో విష్ణు సహస్రనామ పారాయణం, హరేరామ నామజపం 108 సార్లు నిర్వహించారు. రాజ్యలక్ష్మీ సమేత రంగనాథస్వామి దేవస్థానం, షిర్డీ సాయి మందిరాలలో తొలి ఏకాదశి పర్వదిన పూజలు జరిపారు.
- ఆగిరిపల్లి: మండలంలోని వైష్ణవ దేవాలయాలలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. స్థానిక శోభనాచల వ్యాఘ్ర లక్ష్మీ నరసింహస్వామి ఆలయంలో ఉదయం ప్రత్యేక అభిషేక పూజలు చేసి, విశిష్ట అలంకరణ చేశారు. స్థానిక కోదండ రామాలయంలో, నెక్కలం గొల్లగూడెం అడ్డరోడ్డు వేంకటేశ్వర స్వామి ఆలయంలో స్వామి వారికి ప్రత్యేక పూజలు జరిగాయి.

అధైర్య పడొద్దు..అండగా ఉంటాం

మాజీ ఎమ్మెల్యే మేకా ప్రతాప్ అప్పారావు



వైఎస్సార్ సీపీ నాయకులను పరామర్శించిన మాజీ ఎమ్మెల్యే మేకా వెంకట ప్రతాప్ అప్పారావు

ఆగిరిపల్లి: ఎవరూ అధైర్య పడొద్దు.. ప్రతీ కార్యకర్తకు అండగా ఉంటామని మాజీ ఎమ్మెల్యే మేకా వెంకట ప్రతాప్ అప్పారావు అన్నారు. ఇటీవల ఫ్లెక్సీ విషయంపై ఆగిరిపల్లిలో టీడీపీ నాయకులు స్థానిక వైఎస్సార్ సీపీ ఎంపీటీసీ సభ్యుడు సాదం గోపి, గ్రామ పార్టీ అధ్యక్షుడు చిమట శ్రీనివాసరావు, మాజీ ఎంపీటీసీ సభ్యుడు నక్కనబోయిన పండుపై దాడి చేశారు. వారిని ప్రతాప్ అప్పారావు బుధవారం పరామర్శించి ధైర్యం చెప్పారు. ఆయన మాట్లాడుతూ టీడీపీ నాయకుల దాడిని ఖండించారు. ఇలాంటి చర్యలు ప్రజాస్వామ్యంలో తగవన్నారు. మండలంలో ఇంతవరకు ఇటువంటి దాడులు ఎప్పుడూ జరగలేదని చెప్పారు. అధికారంలో ఉన్నప్పుడు తాము ఎన్నడూ కక్షపూరిత చర్యలకు పాల్పడలేదన్నారు. నాయకులు, కార్యకర్తలకు వైఎస్సార్ సీపీ అండగా ఉంటుందని తెలిపారు. కార్యక్రమంలో ఎంపీపీ గొల్ల అనూష, జెడ్పీటీసీ పిన్నిబోయిన వీరబాబు, వైఎస్సార్ సీపీ జిల్లా కార్యదర్శి మచ్చా హరిబాబు, జిల్లా ఉపాధ్యక్షురాలు సుజనా కుమారి, వైఎస్సార్ సీపీ సీనియర్ నాయకులు దిలీప్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

పార్వతీదేవికి సారె సమర్పణ



కాచవరంలో అమ్మవారికి సారె సమర్పిస్తున్న భక్తులు

కాచవరం(ఇబ్రహీంపట్నం): ఆషాఢ మాసంలో తొలి ఏకాదశి పర్వదినం సందర్భంగా కాచవరం శ్రీ రామలింగేశ్వరస్వామి ఆలయంలో స్వామివార్లకు బుధవారం ప్రత్యేక పూజలు జరిగాయి. రామలింగేశ్వర స్వామి వారికి పంచామృత అభిషేకం, అనంతరం పార్వతీ దేవికి అష్టోత్తర కుంకుమార్చన నిర్వహించారు. పులువురు మహిళా భక్తులు అమ్మవారికి పసుపు, కుంకుమ, పండ్లు, పలహారాలు, చీర, గాజులతో సారె సమర్పించారు. ఆలయ అర్చకులు కంచిభోట్ల సుబ్రహ్మణ్యశర్మ అమ్మవారికి పూజలు చేసి సారె నివేదించారు. భక్తులకు తీర్థప్రసాద వితరణ చేశారు.

కనకదుర్గమ్మకు సారె..

తిరువూరు: తిరువూరు విశ్వబ్రాహ్మణ సంఘం ఆధ్వర్యంలో బుధవారం విజయవాడ దుర్గామల్లేశ్వర స్వామి దేవస్థానంలోని కనకదుర్గ అమ్మ వారికి సారె సమర్పించారు. తిరువూరు బైపాస్ రోడ్డులోని మద్విరాట్ పోతులూరి వీరబ్రహ్మేంద్రస్వామి ఆలయం నుంచి పట్టణంలో సారె ఊరేగించారు. అనంతరం విజయవాడకు సంఘ సభ్యులు తరలి వెళ్లారు. కార్యక్రమంలో సంఘ అధ్యక్ష, కార్యదర్శులు చామర్తి రాంబాబు, పమ్మి బ్రహ్మాచారి, కోశాధికారి తరుమణి రామకృష్ణ, ఉపాధ్యక్షుడు రామడుగు శ్రీనివాసరావు, మహిళలు పాల్గొన్నారు.

త్యాగానికి ప్రతీక మొహర్రం



కొండపల్లిలో పీర్లను ఊరేగిస్తున్న ముస్లిం మత పెద్దలు, వివిధ పార్టీల నాయకులు



తిరువూరులో పీర్ల ఊరేగింపు

మైలవరం: త్యాగానికి, సహనానికి ప్రతీక మొహర్రం అని వైఎస్సార్ సీపీ మైలవరం నియోజకవర్గ ఇన్‌చార్జి సర్నాల తిరుపతిరావు అన్నారు. నియోజకవర్గంలోని ముస్లింలకు బుధవారం ఆయన మొహర్రం శుభాకాంక్షలు తెలిపారు. మహ్మద్ ప్రవక్త మనవడు హజరత్ ఇమామ్ హుసేన్ బలిదానానికి మొహర్రం ప్రతీక అని చెప్పారు. ఇస్లామిక్ క్యాలెండర్‌లో మొదటి నెల కూడా మొహర్రం అని, అందరూ త్యాగ స్ఫూర్తిని కలిగి ఉండాలని చెప్పారు.

పీర్ల ప్రదర్శన

గంపలగూడెం: అమరవీరుల త్యాగాలను స్మరిస్తూ శాంతి, సమానత్వం, సామరస్యత, త్యాగాలకు ప్రతీక అయిన మొహర్రంను మండలంలోని పలు గ్రామాల్లో బుధవారం భక్తిశ్రద్ధలతో జరుపుకున్నారు. ఊటుకూరు, వినగడప, గంపలగూడెంలలో నిర్వహించిన కార్యక్రమాల్లో పీర్లను ఊరేగించారు. ఆయా కార్యక్రమాల్లో ముస్లింలు పాల్గొన్నారు.

- తిరువూరు: మొహర్రంను తిరువూరు మండలంలోని ముస్లింలు బుధవారం భక్తిశ్రద్ధలతో జరుపుకున్నారు. త్యాగాలకు ప్రతీకగా మొహర్రంను జరుపుకుంటారని ముస్లిం పెద్దలు తెలిపారు. తిరువూరు పట్టణంలోని పాత తిరువూరు, పాత బస్టాండు సెంటర్, రాజుపేట, లైన్ బజార్లలో పలువురు ముస్లింలు మొహర్రం సందర్భంగా పీర్లను ఊరేగించారు.
- కొండపల్లి(ఇబ్రహీంపట్నం): కొండపల్లి మున్సిపాల్టీ పరిధిలోని పలు దర్గాల్లో పది రోజులుగా నిర్వహించిన మొహర్రం ప్రార్థనలు బుధవారం రాత్రి ముగిశాయి. మహనీయులు, మార్గనిర్దేశకులుగా భావించి మొదటి రోజు ప్రతిష్ఠించిన పీర్లకు పది రోజుల పాటు ప్రత్యేక ప్రార్థనలు చేశారు. సూఫీ మత గురువు మహ్మద్ అల్తాఫ్‌రజా ప్రత్యేక ప్రార్థనలు చేసిన అనంతరం పీర్లను వీధుల్లో ఊరేగించారు. షాబూఖారీ దర్గా వద్దకు ఊరేగింపు చేరుకోవడంతో మత పెద్దలు మొహర్రం ముగిసినట్లు ప్రకటించారు. ఈ సందర్భంగా భారీ అన్నదాన కార్యక్రమం జరిగింది. ముస్లిం పెద్దలు, రాజకీయ పార్టీల నాయకులు పాల్గొన్నారు.

వరద నీరు దిగువకు పారేలా చర్యలు

తిరువూరు ఎమ్మెల్యే శ్రీనివాసరావు



కట్టెలేరు వద్ద వరద పరిస్థితిని పరిశీలిస్తున్న ఎమ్మెల్యే శ్రీనివాసరావు

కట్టెలేరు(గంపలగూడెం): భారీ వర్షాలు కురిసే సమయంలో వరద నీరు వినగడప వంతెన వద్ద సక్రమంగా దిగువకు పారేలా తగిన చర్యలు తీసుకోవాలని తిరువూరు ఎమ్మెల్యే కొలికపూడి శ్రీనివాసరావు అన్నారు. గంపలగూడెం మండలం తోటమూల-వినగడప నడుమ కట్టెలేరు వద్ద వరద కారణంగా నెలకొన్న పరిస్థితిని ఆయన ఆర్‌అండ్‌బీ అధికారులు, స్థానిక పార్టీ నేతలతో కలిసి బుధవారం పరిశీలించారు. కట్టెలేరుపై నిర్మించిన వంతెన ధ్వంసం కాగా రాకపోకలకు తాత్కాలికంగా నిర్మించిన డైవర్షన్ రహదారి కింద నీరు దిగువకు పారేవిధంగా అవసరమైనన్ని తూరలు (బొంగలు) ఏర్పాటు చేయాలని చెప్పారు. ప్రస్తుతం ఉన్న 12 వరసల బొంగలకు తోడుగా మరో ఆరు లైన్ల బొంగలు ఏర్పాటు చేసి వరద కారణంగా రాకపోకలకు ఇబ్బందులు లేకుండా చూడాలని ఆర్ అండ్‌బీ ఏఈ అచ్చారావుకు సూచించారు. ఇందుకోసం అవసరమైన ఎస్టిమేషన్ తయారు చేసి ఇవ్వాలన్నారు. పార్టీ నాయకులు పాల్గొన్నారు.

ఘనంగా ఏకలవ్యుడి జయంతి



ఇబ్రహీంపట్నంలో ఏకలవ్యుడి చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న మేడా రాధ తదితరులు

కొండపల్లి(ఇబ్రహీంపట్నం): ఎరుకుల కులస్తుల ఆరాధ్య దైవం ఏకలవ్యుడి జయంతి వేడుకలు కొండపల్లి మున్సిపాల్టీలోని పలు ప్రాంతాల్లో ఎస్టీ నాయకులు, కూటమి నాయకులు బుధవారం ఘనంగా నిర్వహించారు. ఆయన విగ్రహానికి, చిత్రపటాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ గురువు లేకుండా కఠోర దీక్షతో లక్ష్యాన్ని సాధించాలనే పట్టుదలతో విలు విద్య అభ్యసించిన కృషీవలుడు ఏకలవ్యుడని కొనియాడారు. ఆయన కృషి, పట్టుదలను యువతరం స్ఫూర్తిగా తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో పలువురు ఎస్టీ నాయకులు, కూటమి నాయకులు, మున్సిపల్ కౌన్సిలర్లు పాల్గొన్నారు.

ఎరుకుల హక్కుల సాధనకు కృషి..

ఇబ్రహీంపట్నం: ఎరుకుల కులస్తుల హక్కుల సాధనకు కృషి చేయాల్సిన అవసరం ఉందని ఏపీ ఎరుకుల సేవా సంఘం జిల్లా అధ్యక్షుడు మేడా రాధ అన్నారు. ఇబ్రహీంపట్నంలో ఏపీ ఎరుకుల సేవా సంఘం ఆధ్వర్యంలో ఏకలవ్యుడి జయంతి కార్యక్రమం బుధవారం నిర్వహించారు. ఏకలవ్యుడి చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. పలువురు సంఘం సభ్యులు, స్థానిక నాయకులు పాల్గొన్నారు.

సమస్యలు పరిష్కరించాలని వినతి



కొండపల్లి(ఇబ్రహీంపట్నం): కొండపల్లి మున్సిపాల్టీలోని వివిధ ప్రాంతాల్లో నెలకొన్న సమస్యలు పరిష్కరించాలని ఐఎఫ్‌టీయూ నాయకులు విజ్ఞప్తి చేశారు. ఈ మేరకు సమస్యతో కూడిన వినతిపత్రాన్ని బుధవారం మున్సిపల్ కమిషనర్ శంకర్ నాయక్‌కు అందజేశారు. నేతాజీ నగర్, ఆర్సీఎం కాలనీ, పుట్లమ్మగట్టు ప్రాంతాల్లో డ్రెయినేజీలు పూడుకుపోయి మురుగునీటి వ్యర్థాలు పేరుకుపోయాయన్నారు. మురుగు పారడం లేదని చెప్పారు. నేతాజీ నగర్‌లో తాగునీటి సరఫరా నిలిచిపోయి చాలా రోజులు అవుతోందన్నారు. తక్షణమే తాగునీటి సరఫరాను పునరుద్ధరించాలని, డ్రెయినేజీల్లో మురుగునీరు పారదల అయ్యేలా చూడాలని, విష జ్వరాలు ప్రబలకుండా చర్యలు చేపట్టాలని కోరారు. ఐఎఫ్‌టీయూ నాయకులు కొప్పుల కుమార్, జానీ, సాంబశివరావు పాల్గొన్నారు.

20న మండల పరిషత్ సమావేశం

ముసునూరు: మండల పరిషత్ సర్వసభ్య సమావేశం ఈ నెల 20న ఉదయం 11 గంటలకు ఎంపీపీ కొండా దుర్గాభవాని అధ్యక్షతన జరుగుతుందని ఎంపీడీఓ పద్మావతీదేవి తెలిపారు. 19న జరగాల్సిన సమావేశం 20వ తేదీకి మారిందని చెప్పారు. ఎంపీటీసీలు, ప్రజా ప్రతినిధులు, అధికారులు హాజరు కావాలని కోరారు.

శాస్త్రీయ విజ్ఞానం పెంపొందాలి

తిరువూరు: ప్రజల్లో శాస్త్రీయ విజ్ఞానం పెంపొందినప్పుడే సమాజం అభివృద్ధి చెందుతుందని సీనియర్ పాత్రికేయులు ఎస్. వెంకట్రావు అన్నారు. స్థానిక సుందరయ్య భవన్‌లో బుధవారం జన విజ్ఞాన వేదిక ఆధ్వర్యంలో శాస్త్రీయ దృక్పథం-ఆవశ్యకత అంశంపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ పాలకులు తమ ఉనికి కోసం ప్రజల్లో మూఢ నమ్మకాలను ప్రోత్సహిస్తున్నారని చెప్పారు. ప్రయోగం, పరిశీలన అనంతరం ఆధారాలతో రుజువు చేసేదే శాస్త్రీయ దృక్పథమని, వాటినే నమ్మాలన్నారు. ప్రజల ఆలోచనలను మరల్చేందుకే పాలకులు మూఢ నమ్మకాలకు విస్తృత ప్రచారం కల్పిస్తున్నారని విమర్శించారు. పలువురు వక్తలు మాట్లాడారు.

- ఇబ్రహీంపట్నం: కాలనీ వాసులు అప్రమత్తంగా ఉండాలని సీఐ ఎం.సత్యనారాయణ అన్నారు. సైబర్ నేరాలు, మహిళలు, బాలికలపై జరుగుతున్న దాడులు, తాళాలు వేసి ఉన్న ఇళ్లల్లో చోరీలపై అవగాహన సదస్సు ఎన్టీటీపీఎస్ సెక్యూరిటీ కాలనీలో బుధవారం నిర్వహించారు. సీఐ మాట్లాడుతూ మాదక ద్రవ్యాలను అరికట్టడంలో ప్రజల సహకారం అవసరమని చెప్పారు. అనుమానాస్పద వ్యక్తుల సమాచారం ఇవ్వాలని సూచించారు.